GSTIN-NO:36FKPSI308PIZX
epaper:tmedia.net.in
# టి-మీడియా
T MEDIA
సామాజికం... ప్రజల పక్షం
మెయిన్
సంపుటి : 6 | సంచిక : 262 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | మంగళవారం : మే 14-2024 | పేజీలు : 3

## కొడంగల్‌లో ఓటు హక్కును వినియోగించుకున్న సీఎం రేవంత్ రెడ్డి

**టి మీడియా, మే 13,కొడంగల్ :**
తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటువేసేందుకు కుటుంబసభ్యులతో కొడంగల్‌కు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి.. జిల్లా పరిషత్ స్కూలులోని పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. కుటుంబసభ్యులతో కలిసి ఓటు వేసిన అనంతరం స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మహబూబ్ నగర్ స్థానంలో తాము గెలవబోతున్నామన్నారు. సంక్షేమ పథకాలకు, ప్రభుత్వానికి ఈ ఎన్నికలు రెఫరెండం అని తెలిపారు.అనంతరం గ్రామస్థులతో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఈ పలు విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు.



# ప్రశాంతంగా పోలింగ్



- తెలంగాణలో పెరిగిన ఓటింగ్ శాతం..
- ఎన్నికల ప్రధానాధికారి వికాస్ రాజ్

**టీ.మీడియా, మే13, హైదరాబాద్:**
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రశాంతంగా పోలింగ్ ముగిసింది. ఎక్కడ ఎలాంటి సమస్యలు లేకుండా రాష్ట్రవ్యాప్తంగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. లా అండ్ ఆర్డర్ విషయంలో పోలీసుల సహకారం పూర్తిగా అందిందని ఎన్నికల ప్రధానాధికారి వికాస్ రాజ్ తెలిపారు. 2019తో పోల్చితే ఐదు నుంచి 10 శాతం పోలింగ్ పెరిగే అవకాశం ఉంటుంది అన్నట్లుగా అంచనా వేస్తున్నారు ఎన్నికల అధికారులు.తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రశాంతంగా పోలింగ్ నమోదయింది. 17 పార్లమెంటు స్థానాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, మొదటి ఒకటి రెండు గంటలు ఈవీఎంలు మొరాయించిన తరువాత పూర్తిస్థాయిలో సజావుగా పోలింగ్ జరిగింది. దీనికి తోడు రోజంతా వాతావరణం కూడా ఓటర్లకు సహకరించడంతో 2019 తో పోల్చితే 2024 లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ ఐదు నుంచి పది శాతం పెరిగే అవకాశం ఉంటుంది అన్నట్లుగా అధికారులు అంచనా వేస్తున్నారు.ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటల వరకు ఎక్కడ ఎలాంటి సమస్యలు లేకుండా జరిగింది. అయితే మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన 5 పార్లమెంట్ స్థానాల్లోని 13 అసెంబ్లీ నియోజకవర్గాలైన అదిలాబాద్ పార్లమెంట్ లోని సిర్పూర్, ఆసిఫాబాద్, పెద్దపల్లిలో చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల, మంథని, వరంగల్ పార్లమెంట్ పరిధిలో భూపాలపల్లి, మహబూబ్ బాద్ పార్లమెంట్ పరిధిలో ములుగు, పినపాక, ఇల్లందు, భద్రాచలం, ఖమ్మం పార్లమెంట్ పరిధిలో కొత్తగూడెం, అశ్వారావుపేటలో సాయంత్రం నాలుగు గంటలకి ముగిసింది. ఒక నాలుగు ఐదు పోలింగ్ స్టేషన్స్ మినహాయిస్తే నాలుగు గంటలకు ముగిసిన 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాల్లో నాలుగు గంటలకే దాదాపుగా ఓటర్లంతా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మిగిలిన 106 స్థానాల్లో సాయంత్రం ఆరు గంటలకు పోలింగ్ జరిగినట్లు సీఈఓ వికాస్ రాజ్ వెల్లడించారు.తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆరు గంటలకు పోలింగ్ ముగిసిన 14వందల పోలింగ్ కేంద్రాల్లో ఇంకా క్యూ లైన్లలో ఓటర్లు ఉన్నారన్నారు సీఈఓ. పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగిందని వాతావరణం కూడా సహకరించిందని సీఈవో అన్నారు. లా అండ్ ఆర్డర్ లో కూడా ఎలాంటి ఇబ్బంది రాలేదని, రాత్రి 7 గంటల తరువాత ఓటింగ్ డేటా ఎంట్రీ స్టార్ట్ అవుతుందన్నారు. పోలింగ్ రోజు 400 వందల ఫిర్యాధు రాగా 38 ఎఫ్ఐఆర్‌లు నమోదు అయినట్టు ప్రకటించారు. అదేవిధంగా 2వందలకు పైగా %జ% విజిల్ ద్వారా ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఇక ఎన్నికల్లో రూ. 330 కోట్లు సీజ్ అయ్యాయని, అర్ధరాత్రి వరకు పోలింగ్ శాతం గంట గంటకు మారుతుందన్నారు. మే14 మధ్యాహ్నం వరకు సరైన పోలింగ్ శాతం చెప్పడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.స్ట్రాంగ్ రూం లకు ఈవీఎంల తరలింపులో వాహనాలకు %ఙూ% ఉంటుందని, పటిష్టమైన బందోబస్తు




నడుమ ఈవీఎంలను అర్ధరాత్రి లోపు స్ట్రాంగ్ రూములకు తరలిస్తామన్నారు వికాస్ రాజ్. మే 14వ తేదిన పోలింగ్ పై స్క్రూటినీ ఉంటుందన్నారు. ఇక జరిగినటువంటి పోలింగ్‌పై అబ్జర్వర్ల నిర్ణయం తర్వాత రీపోలింగ్ ఉంటుందా లేదా అన్నది ప్రకటిస్తామన్నారు. అయితే, ఇప్పటికీ రాష్ట్రంలో ఎక్కడ కూడా రీపోలింగ్ నిర్వహించేటువంటి పరిస్థితులు జరగలేదన్నారు సీఈవో. రాష్ట్ర వ్యాప్తంగా 44 కౌంటింగ్ కేంద్రాలు అదే కౌంటీ కేంద్రాల వద్ద 44 స్ట్రాంగ్ రూమ్ లు ఉన్నాయని వాటి దగ్గర కూడా పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేసి 24 గంటల పాటు సీసీటీవీ మానిటరింగ్ ఉంటుందన్నారు అదేవిధంగా మూడంచెల బందోబస్తు సైతం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.హైదరాబాద్ పార్లమెంట్ బిజెపి అభ్యర్థి మాధవిలతపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. నిజామాబాద్, జహీరాబాద్ లలో కేసులు అయ్యాయని, మిగిలిన చోట్ల చెదురు మదురు ఘటనలు తప్పా, తీవ్రమైన ఘటనలు ఎక్కడ జరగలేదన్నారు. 2019 తో పోల్చితే 2024లో పోలింగ్ శాతం ఎక్కువగా జరిగిందని సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

## రీ-పోలింగ్ అవసరం లేదని భావిస్తున్నాం

**ఏపీసీఈవో ముకేశ్ కుమార్ మీనా**




**టీ.మీడియా, మే13, అమరావతి :**
ఏపీలో రీ పోలింగ్ కు సంబంధించి సీఈవో ముకేశ్ కుమార్ మీనా కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో ఎక్కడా రీ-పోలింగ్ అవసరం లేదని భావిస్తున్నాం అన్నారు. స్క్రూటినీ తర్వాతే రీ-పోలింగ్ విషయంలో నిర్ధారిస్తామన్న సీఈవో ముకేశ్ కుమార్ మీనా.. రీ-పోలింగ్ కోసం ఎలాంటి రిక్వెస్టులు రాలేదని వెల్లడించారు.ఏపీలో పోలింగ్ కు సంబంధించిన వివరాలను సీఈవో ముకేశ్ కుమార్ మీనా వెల్లడించారు. ఇంకా 3వేల 500 పోలింగ్ స్టేషన్లలో పోలింగ్ జరుగుతోందని తెలిపారు. ప్రతి చోట 100 నుంచి 200 మంది ఓటర్లు క్యూలైన్ లో ఉన్నారని వెల్లడించారు. రాత్రి 10 గంటల కల్లా అన్ని చోట్ల పోలింగ్ ప్రక్రియ పూర్తవుతుందని చెప్పారు. పోలింగ్ శాతం బాగా పెరిగిందని నమ్ముతున్నాం అన్నారు. గత ఎన్నికల పోలింగ్ శాతం కంటే ఈసారి పోలింగ్ శాతం పెరుగుతుందని ఆశిస్తున్నామన్నారు.నేనిప్పుడే పోలింగ్ శాతం చెప్పలేను. ఎక్కడా రీ-పోలింగ్ అవసరం లేదని భావిస్తున్నాం. 17%ూ% స్క్రూటినీ తర్వాతే రీ-పోలింగ్ విషయంలో నిర్ధారిస్తాం. రీ-పోలింగ్ కోసం ఎలాంటి రిక్వెస్టులు రాలేదు. తెనాలి, నరసరావుపేట ఎమ్మెల్యేలను హౌస్ అరెస్ట్ చేశాం. ఈవీఎం యూనిట్లను స్ట్రాంగ్ రూంలకు తరలిస్తున్నాం. ఉదయం నుంచి పెద్ద ఎత్తున ఓటర్లు వచ్చారు. ఈవీఎం మెషీన్లతో కొన్ని ఇబ్బందులు వచ్చాయి. సాంకేతిక ఇబ్బందులు గతంతో పోల్చుకుంటే తక్కువగా ఉన్నాయి. పోలింగ్ కు వాతావరణం బాగా సహకరించింది.నా దగ్గర కార్డు ఉంది. కానీ.. ఓటు లేదనే ఫిర్యాదులు ఎక్కడా కన్పించ లేదు. బందోబస్తు పెద్ద ఎత్తున పెట్టాం. పల్నాడు, అనంతపురం, అన్నమయ్య జిల్లాల్లో అదనపు బలగాలు మోహరించాయి. పీలేరులో ఏజెంట్ల కిడ్నాప్ ఘటన జరిగినా.. వెంటనే సమస్య పరిష్కరించాం. పల్నాడులో 12 ఘటనలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయి. మాచర్ల పరిధిలో 8 ఈవీఎం మెషీన్లని ధ్వంసం చేశారు. కానీ డేటా ఎక్కడికీపోలేదు. పోలింగ్ కు కొద్దిసేపు అంతరాయం కలిగింది. ఆ తర్వాత పోలింగ్ ప్రారంభించాం.11 చోట్ల ఈవీఎంల ధ్వంసం జరిగింది. హింసాత్మక ఘటనలు జరిగినా.. మెషీన్ల డామేజ్ జరిగినా పోలింగ్ నిర్వహించగలిగాం. ఎక్కడా రీ-పోలింగ్ అవసరం లేదు. తెనాలి, అనంతపురంలలో లీడర్లను హౌస్ అరెస్ట్ చేశాం" అని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా తెలిపారు.



## చింతమడకలో ఓటేసిన బీఆర్ఎస్ కేసీఆర్ దంపతులు

**టి మీడియా, మే 13, సిద్దిపేట :**
జిల్లాలోని చింతమడకలో బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన సతీమణి శోభ తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కేసీఆర్ వెంట మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు పలువురు నాయకులు ఉన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పోలింగ్ బాగా జరుగుతోంది. 65 శాతానికి మించి పోలింగ్ జరిగే అవకాశం ఉంది. ఎన్నికల తర్వాత దేశంలో ప్రాంతీయ పార్టీలదే కీలక పాత్ర అవుతుందని కేసీఆర్ పేర్కొన్నారు.

### సహకరించిన వారికి కృతజ్ఞతలు

**ఖమ్మం :** ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఖమ్మం నగరంలో వివిధ ఎన్నికల బూత్‌లను సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు యర్రా శ్రీకాంత్, వై విక్రమ్ పరిశీలన చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడారు.



## ఓటరుపై తెనాలి ఎమ్మెల్యే దౌర్జన్యం

**టి మీడియా, మే 13,తెనాలి :**
సార్వత్రిక ఎన్నికలు కొనసాగుతోన్న వేళ %ొ% తెనాలిలో అవాంఛనీయ ఘటన జరిగింది. ఉదయం నుండి క్యూలో నిలబడి వరుసగా ఓటు వేస్తున్న ఓటర్లను దాటుకుంటూ %ొ% తెనాలిలో సిట్టింగ్ ఎమ్మెల్యే, వైసిపి అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ పోలింగ్ కేంద్రంలోకి నేరుగా వెళ్లారు. లైన్‌లో రాకుండా ఇలా నేరుగా వచ్చారేంటి అని సామాన్య ఓటరు ప్రశ్నించారు. దీంతో ఎమ్మెల్యే మండిపడ్డారు ఓటరు చెంపపై ఛెళ్లున కొట్టారు. అంతే స్పీడుతో ఆ ఓటరు ఎమ్మెల్యే చెంపపై కొట్టారు. ఇదంతా చూసిన ఎమ్మెల్యే అనుచరులు ఆ ఓటరుపై విరుచుకుపడ్డారు. మూకుమ్మడిగా దాడి చేశారు. పిడిగుద్దులు కొడుతూ బయటకు లాక్కెళ్లి విచక్షణారహితంగా కొట్టారు. ఈ దౌర్జన్యమంతా గుంటూరు జిల్లా తెనాలిలోని పోలింగ్ బూత్ లో జరిగింది. ప్రస్తుతం ఈ సంఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

# ఫ్యాక్షన్ పంజా



### పల్నాడులో గృహ నిర్బంధంలో మాచర్ల అభ్యర్థులు

**టీ.మీడియా, మే13, పల్నాడు:**
ప్రాంతంలో అందరూ ఊహించినట్లుగా అధికార, ప్రతిపక్ష పార్టీల అనుయాయుల మధ్య ఎన్నికల సందర్భంగా సోమవారం పలుచోట్ల ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఇరుపార్టీల వారు ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న విషయం తెలిసిందే. పోటీపోటీగా ఓటర్లను ఆకర్షించే ప్రక్రియలో ఇరుపార్టీల మధ్య తలెత్తిన వివాదాలు పలుచోట్ల ఘర్షణలకు దారితీశాయి. వైసీపీ అభ్యర్థి, మాచర్ల సిట్టింగ్ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డిలను పోలీసులు గృహనిర్బంధంలో ఉంచారు. నియోజకవర్గంలో గొడవలు జరుగుతున్న నేపథ్యంలోనే ఈ అరెస్టులు జరిగినట్లుగా సమాచారం. మాచర్ల పట్టణంలో తెలుగుదేశం నాయకుడు కేశవరెడ్డి నివాసంలో ఉన్న ఆ పార్టీ నాయకులుపై వైసిపి వారు వచ్చి మూకుమ్మడి దాడులు చేశారు. మరికొందరు పారిపోతుండగా కారులో వెంబడించారు. ఈ దాడుల్లో పదిమంది వరకూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను పోలీసులు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. రెంటచింతల మండలం పాలువాయి గేటు గ్రామంలో మాచర్ల ఎమ్మెల్యే పిఆఆర్‌కె వాహనాన్ని టిడిపి వారు ధ్వంసం చేశారు. పల్నాడుజిల్లా ముప్పాళ్ళ మండలం నార్నెపాడులో పోలింగ్‌ను పరిశీలించడానికి వెళ్లిన అంబటి రాంబాబు అల్లుడు ఉపేష్ కారు పై టిడిపికి చెందిన వారు దాడి చేశారు. ఈ దాడిలో కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. ఘటనను మంత్రి అంబటి రాంబాబు తీవ్రంగా ఖండించారు. ఓడిపోతామని నిరాశతో టీడీపీ నాయకులు దాడులకు తెగబడుతున్నారన్నారు. పోలీసులు రబ్బరు బుల్లెట్లను వినియోగించారు. తుళ్ళూరు మండలం పెదపరిమిలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. వైసిపి నేత సందీప్,, టిడిపి నాయకుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. పలువురు ఈ ఘటనలో గాయాలపాలయ్యాయి. గుంటూరు కొరిటపాడులో ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసుల లాఠీ చార్జి చేశారు. ఈ ఘటనపై జిల్లా ఎస్పితో మంత్రి విడుదల రజనీ, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడారు. పల్నాడులో పోటాపోటీ దాడులుపల్నాడులో వైసిపి, టిడిపి నాయకులు భారీగా తెగబడుతున్నారు. పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం ఉప్పలపాడులో వైసీపీ నేతలు దౌర్జన్యానికి పాల్పడ్డారు. టీడీపీ తరుపున ఏజెంట్ ఫామ్ ఇవ్వడానికి వెళ్లిన సుబ్బయ్యపై వైసీపీ శ్రేణులు దాడులకు పాల్పడ్డాయి. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన సుబ్బయ్యను వెంటనే నరసరావుపేట ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అలాగే అటు మాచర్ల నియోజకవర్గంలోనూ వైసీపీ దౌర్జన్యానికి దిగింది. రెంటచింతలలో టీడీపీ ఏజెంట్లు దాడికి పాల్పడ్డారు. నలుగురు టీడీపీ ఏజెంట్లకు తలలు పగిలాయి. ఏజెంట్లుగా టీడీపీ వాళ్లకు ఉండటానికి వీలేద్దని హెచ్చరికలు జారీ చేశారు. ఈ ఘటనపై చంద్రబాబు సీరియస్ అయ్యారు. ఈవిఎంలను ధ్వంసం చేశారనే అభియోగంమాచర్ల నియోజకవర్గంలో ఈవీఎంలను టీడీపీ నేతలు ధ్వంసం చేశారని వైసిపి నాయకులు విమర్శించారు. రెంటచింతల మండలం తుమ్మూరు కోటలో మొత్తం ఆరు పోలింగ్ బూతులను అధికారులు ఏర్పాటు చేశారు. 203, 204, 206 పోలింగ్ బూత్‌ల్లో మూడు ఈవీఎంలను టీడీపీ నేతలు పగలగొట్టారని ఆరోపించారు. ఇరుపార్టీల వారు అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద మోహరించటంతో ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. టిడిపి, వైసిపి వారు ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేసుకున్నారు.



## పోలింగ్ కేంద్రంలో మాధవిలత హల్ చల్..

**టి మీడియా, మే 13, హైదరాబాద్ :**
పార్లమెంటు నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి మాధవిలత సోమవారం పోలింగ్ కేంద్రం వద్ద హల్ చల్ చేశారు. ఓటు వేయాడానికి వచ్చే ప్రతి ఒక్కరు ముఖం చూపిస్తేనే ఓటు వేయించాలని అధికారులకు హుకుం జారీ చేశారు. ఈ క్రమంలో ఆమె పోలింగ్ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. పలువురి ఓటర్ల ముఖాలను స్వయంగా ఆమె తనిఖీ చేశారు. ఆమె తీరుపై పలువురు ఓటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలింగ్ కేంద్రంలో అభ్యర్థికి ఏం పనంటూ మరికొందరు ప్రశ్నించారు. హైదరాబాద్ స్థానం నుంచి ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ బరిలోకి దిగారు. అసద్, మాధవిలత మధ్యే ప్రధాన పోటీ ఉండనుంది.

# షిప్‌యార్డ్ కాంట్రాక్టు ఎల్అండ్‌టికి!

- 2 నౌకల నిర్మాణ పనులు అప్పగించే యత్నం?
- హెచ్‌ఎస్ఎల్ మనుగడపై తీవ్ర ప్రభావం
- ఉద్యోగులు, కార్మికుల్లో ఆందోళన

**టి మీడియా, మే 13,విశాఖ బ్యూరో :**
విశాఖలోని హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్‌ఎస్ఎల్) ఈ ఏడాది పిబ్రవరిలో దక్కించుకున్న రూ.19 వేల కోట్ల 5 ఫ్లీట్ సపోర్టు షిప్ (ఎఫ్ఎస్‌-ఎస్)ల కాంట్రాక్టును యాజమాన్యం దొడ్డిదారిన ఎల్అండ్‌టి ప్రైవేట్ కంపెనీకి ధారాదత్తం చేయాలని చూస్తోంది. ఓ పక్క దేశంలో సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ సాగుతుండగా సందట్లో సడేమియా అన్నట్టుగా సుమారు రూ.8200 కోట్ల విలువైన రెండు షిప్‌ల నిర్మాణ బాధ్యతలను ఎల్అండ్‌టికి అప్పగించడానికి రంగం సిద్ధం చేసింది. 2014లోనే షిప్‌యార్డుకు దక్కాల్సిన 5 ఎఫ్ఎస్ఎస్‌ల కాంట్రాక్టును కేంద్రంలోని బిజెపి ఇవ్వనిరాకరించింది. ఎట్టకేలకు 2023లో దీన్ని హిందుస్థాన్ షిప్‌యార్డు సాధించగలిగింది. పదేళ్ల తర్వాతైనా షిప్‌యార్డుకు ఆర్డర్లు దక్కినందుకు ఉద్యోగులు, కార్మికులు సంతోషించారు. వాస్తవానికి 2010లోనే రక్షణ అవసరాల నిమిత్తం కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ విశాఖ హెచ్‌ఎస్ఎల్‌ను తన అధీనంలోకి తీసుకుంది. ఎఫ్ఎస్ఎస్, ఎల్‌పిడి, పి 751 సబ్‌మెరైన్‌ల వర్క్ ఆర్డర్లను నామినేషన్ పద్ధతిలో ఇస్తామని కేంద్రం ఆనాడే హామీ ఇచ్చింది. ఆ తర్వాత కేవలం 11184 షిప్‌ను మాత్రమే నామినేషన్ పద్ధతిలో కేటాయించింది. ఆ తర్వాత అన్నీ బహిరంగ మార్కెట్‌లో టెండర్ల ద్వారా పోటీపడేలా హిందుస్థాన్ షిప్‌యార్డును బిజెపి సర్కారు వదిలేసింది. 5 ఎఫ్ఎస్ఎస్‌ల నిర్మాణాన్ని సకాలంలో ప్రారంభించలేదు. వీటి నిర్మాణం, మౌలిక వసతుల ఏర్పాటుకు బ్యాంకుల నుంచి షిప్‌యార్డు రూ.వందల కోట్లు రుణం తెచ్చింది. దీనికి ఏడాదిన్నరగా వడ్డీలు కడుతూ అప్పుల్లోకి వెళ్లిపోయినట్టు సమాచారం. దీన్ని సాకుగా చూపించి తాజాగా 2 నౌకల నిర్మాణ బాధ్యతలను ఎల్అండ్‌టికి ఇచ్చేయాలని, నాలుగో దశ ఎన్నికల తర్వాత ఈ ప్రక్రియను పూర్తి చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ నిర్ణయం పట్ల షిప్‌యార్డు ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది.




### టెండర్ల ప్రక్రియ ఎలా ఉండబోతుంది?

రూ.8200 కోట్ల విలువైన 2 ఎఫ్ఎస్ఎస్‌ల నిర్మాణాన్ని నేరుగా ఎల్అండ్‌టికి ఇచ్చేస్తే విమర్శలు వస్తాయని భావించిన షిప్‌యార్డు యాజమాన్యం కొచ్చిన్ షిప్‌యార్డును 'డమ్మీ'గా పిలిచేందుకు రంగం సిద్ధం చేసింది. నేరుగా ఒక ప్రయివేట్ కంపెనీకి షిప్‌యార్డులోని షిప్‌ల నిర్మాణ బాధ్యతలను ఇవ్వకూడదన్న నిబంధన వల్ల కొచ్చిన్ షిప్‌యార్డుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎంట్రీ ఇచ్చింది. ఈ నేపథ్యంలో షిప్‌యార్డు యాజమాన్యం ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించింది. కేంద్రం ఇంతలా ఉత్సాహం చూపడానికి కారణమూ లేకపోలేదు. ప్రధాని మోడీ సన్నిహితుడైన కార్పొరేట్ అదానీ%ొ% దేశంలోని కొచ్చిన్ షిప్‌యార్డులోకి ఇదివరకే 'అదానీ హార్బర్ సర్వీసెస్ లిమిటెడ్' పేరుతో ప్రవేశించారు. దేశంలోని మేజర్ పోర్టులన్నిట్లోనూ అదానీ పోర్ట్స్ హార్బర్ సర్వీసెస్ తయారు చేసే గ్రీన్ టగ్లను వాడాలన్న నిబంధనను కేంద్రం 2023లోనే పెట్టింది. ఈ మేరకు కేంద్ర షిప్పింగ్ మంత్రిత్వ శాఖ నౌకల నిర్మాణ వ్యవహారాల్లో అదానీ గ్రూప్‌తో ఎంఒయు కూడా చేసుకున్నందున 5 ఎఫ్ఎస్ఎస్‌ల్లో ప్రస్తుతం రెండింటికి, తర్వాత మిగతా మూడింటికీ ఎసరొచ్చే ప్రమాదం ఉంది. ఈ దృష్ట్యా 2024లో నికర లాభ లక్ష్యం రూ.1000 కోట్లు షిప్‌యార్డుకు రాదన్నది స్పష్టమవుతోంది. దీంతో, షిప్‌యార్డు ఉద్యోగులు, కార్మికుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. మొత్తంగా 5 ఎఫ్ఎస్ఎస్‌లు నిర్మిస్తే వచ్చే రూ.19 వేల కోట్ల టర్నోవర్ సొమ్మును ప్రయివేట్ కార్పొరేట్ దోచుకోనున్నారనే చర్చ సాగుతోంది. ఎల్అండ్‌టికి ఇచ్చే రెండు షిప్‌ల నిర్మాణ టెండరు వ్యవహారంపై పోరాడేందుకు షిప్‌యార్డు ఉద్యోగులు సిద్ధమవుతున్నారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటేయాలి

- బీజేపీ, బీఆర్ఎస్‌లకు ఓటేస్తే రాజ్యాంగాన్ని కోల్పోతాం
- బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్ రద్దు
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**నవతెలంగాణ- కల్లూరు**
నేడు ప్రజాస్వామ్యం ప్రమాదపుటంచుల్లో ఉందని, కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, కాపాడుకునే అవకాశం మనందరికీ వచ్చిందని, ప్రతి ఒక్కరూ కాంగ్రెస్‌కు ఓటేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని నారాయణపురం గ్రామంలో తమ ఓటు హక్కు వినియోగించుకోవడం కోసం సోదరుడు ప్రసాద్ రెడ్డి కుటుంబ సభ్యులతో వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్, బిజెపిలకు ఓటు వేస్తే మతతత్వంతో దేశం సర్వనాశనం అవుతుందని అన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని సమూలంగా మార్చివేసి భారతదేశంలో ప్రజాస్వామ్యం లేకుండా చేసేందుకు బిజెపి పార్టీ ప్రయత్నిస్తుందని, మరోసారి బిజెపి అధికారంలోకి వస్తే ఇవే మనకి చివరి ఎన్నికలు అవుతాయన్నారు.

# ఓటు హక్కు వినియోగించుకున్న కాంగ్రెస్ అభ్యర్థి రఘురాం రెడ్డి

- పలు పోలింగ్ కేంద్రాల సందర్శన



**టీ.మీడియా, మే13,ఖమ్మం:**
కాంగ్రెస్ ఖమ్మం లోక్ సభ అభ్యర్థి రామ సహాయం రఘురాం రెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. సోమవారం మహబూబాబాద్ మండలం మాదాపురం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం(బూత్ నంబర్ 282) లో ఓటేశారు. పలు పోలింగ్ కేంద్రాల సందర్శన నగరంలోని నృసింహస్వామి దేవాలయానికి సోమవారం ఉదయం వెళ్లి.. రామ సహాయం రఘురా%శీ% రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 57 వ డివిజన్ లోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. ఆ తర్వాత బొక్కలగడ్డ, సుందరయ్య నగర్, శ్రీనివాస నగర్, ముస్తఫా నగర్, తుమ్మల గడ్డ, మామిళ్ళగూడెం, వీడివోస్ కాలనీ, బల్లేపల్లి, పాండురంగాపురం, రఘునాథపాలెం మండలం మంచుకొండ, ఈర్లపూడి, వీవీ. పాలెం, చింతకాని మండలం పొద్దుటూరు, చింతకాని, బోనకల్ మండలం రావినూతల, జానకీ పురం, వైరా మండలం పాలడుగు వైరా, రెబ్బవరం, తల్లాడ, ఏన్కూరు మండల కేంద్రాలు, జూలూరు పాడు మండల%శీ% పడమటి నరసింహాపురం పోలింగ్ సెంటర్లను సందర్శించారు. ఎన్నికల నియమావళిని పాటిస్తూ..మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఆయా కేంద్రాల్లో పోలింగ్ సరళని పరిశీలించారు. ఆయన వెంట వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, నాయకులు బొర్రా రాజశేఖర్, తదితరులు ఉన్నారు.

## సమస్యాత్మక ప్రాంతాల్లో పోలింగ్ ప్రశాంతం..

- రిమోట్ ఏరియాల్లో స్వేచ్ఛగా ఓటింగ్



**టీ.మీడియా, మే13, హైదరాబాద్:**
ఓ పనైపోయింది. సమస్యాత్మక ప్రాంతాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. తెలంగాణలో మావోయిస్ట్ ప్రభావిత ప్రాంతాల్లో గడువు ప్రకారం సాయంత్రం 5 గంటల కల్లా పోలింగ్ పూర్తయింది. అటు ఏపీలో కూడా ఏజెన్సీలో పోలింగ్ సజావుగా జరిగింది.తుపాకీ నీడలో ఓటు పడింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా రిమోట్ ఏరియాల్లో ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు చేపట్టారు అధికారులు. దాంతో గడవు ప్రకారం 5 గంటల కల్లా సమస్యాత్మక ప్రాంతాల్లో పోలింగ్ ప్రక్రియ సజావుగా ముగిసింది. తెలంగాణలో ఖమ్మం, మహబూబాబాద్, పెద్దపల్లి, ఆదిలాబాద్, వరంగల్ 5 పార్లమెంట్ స్థానాల్లోని 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.%-% సిర్పూర్, ఆసిఫాబాద్, చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల.., మంథని, భూపాలపల్లి, ములుగు, పినపాక, ఇల్లందు, భద్రాచలం, కొత్తగూడెం, అశ్వారావుపేటలో ఎలాంటి గొడవల్లేకుండా పోలింగ్ జరిగింది.సాయంత్రం 4గంటలలోపు క్యూలైన్‌లో ఉన్నవాళ్లందరికీ ఓటు వేసే అవకాశం కల్పించారు అధికారులు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మావోయిస్టు ప్రాబల్యమున్న చర్ల, దుమ్ముగూడెం ప్రాంతాల్లోని ఉంజుపల్లి, తిప్పాపురం, పెద్దమిడిసిలేరు, పైడిగూడెం గౌరారంలో కట్టుదిట్టమైన భద్రత మధ్య పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ముందు జాగ్రత్త చర్యగా సమస్యాత్మక ప్రాంతాల్లో భద్రత బలగాలను భారీగా మోహరించారు. పోలింగ్ కేంద్రాల దగ్గర నిఘాను ముమ్మరం చేశారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టారు. తుపాకీ నీడలో పోలింగ్ సజావుగా సాగింది.ఇక అటు ఏపీలోనే ఏజెన్సీ ఏరియాల్లో పోలింగ్ సజావుగా సాగింది.అరకు, పాడేరు, రంపచోడవరం,పాలకొండ, కురుపాం, సాలూరులో 5 గంటల కల్లా పోలింగ్ పూర్తయింది. అల్లూరి జిల్లా పాడేరులో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కారణంగా ఓటింగ్ మందగించింది. చాలా చోట్ల కరెంట్ సరఫరా నిలిచిపోయింది. మొత్తానికి గడువు ప్రకారం పోలింగ్ ముగిసింది.



## ఆర్టీసీ బస్సులో వెళ్లి ఓటు వేసిన మంత్రి

**టి మీడియా, మే 13,హుస్నాబాద్ :**
తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ కొనసాగుతోంది. 17 లోక్ స్థానాలతో పాటు కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికకు సోమవారం ఉదయం 7 గంటల నుండి ఓటింగ్ మొదలైంది. అయితే మంత్రి పొన్నం ప్రభాకర్ మాత్రం ఓటు వేసే వేళ కూడా తన ప్రత్యేకతను చాటుకున్నారు. కారులో వెళ్లకుండా.. వెరైటీగా ఆర్టీసీ బస్సులో వెళ్లి మంత్రి ఓటు వేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటు హక్కును మంత్రి వినియోగించుకున్నారు. అనంతరం పొన్నం మాట్లాడుతూ.. భారత పౌరునిగా ప్రజాస్వామ్యాన్ని కాపాడడానికి నా ఓటు హక్కును వినియోగించుకున్నానని, అలాగే బాధ్యత గల పౌరులుగా ప్రజలందరూ విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే మతతత్వానికో, ప్రాంతీయతత్వానికో ఇతర ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టడానికి ఓటు అనే ఆయుధం ద్వారా విధిగా ఎన్ని పనులు ఉన్నా ఎన్ని బాధ్యతలు ఉన్నా ప్రతి పౌరుడు ఓటు వేసి బాధ్యతతో ఉండాలని అన్నారు.

## ప్రజాసేవ పట్ల చిత్తశుద్ధి ఉన్న నాయకుడు రాధాకృష్ణ

- మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



**టీ మీడియా, మే 13, వనపర్తి బ్యూరో :**
వనపర్తి జిల్లా కేంద్రంలోని 31 కౌన్సిలర్ బండారు.రాధాకృష్ణ కి నివాళులు అర్పించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి. కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ బండారు.రాధాకృష్ణ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న నిరంజన్ రెడ్డి వారి ఇంటికి చేరుకొని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాధాకృష్ణ మృతి తీరని లోటని ప్రజాసేవ పట్ల చిత్తశుద్ధి ఉన్న నాయకుడని కొనియాడారు.కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి ధైర్యంగా ఉండాలి అని అన్నారు.నిరంజన్ రెడ్డి వెంట పి.రమేష్ గౌడ్, నందిమల్ల.అశోక్, ఉంగ్లమ్. తిరుమల్ ఉన్నారు.

## కౌన్సిలర్ రాధాకృష్ణ మృతిపట్ల రావుల సంతాపం

**టీ మీడియా, మే 13, వనపర్తి బ్యూరో :**



మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ బండారు. రాధాకృష్ణ మృతిపట్ల మాజీ రాజ్యసభ సభ్యులు రావుల.చంద్రశేఖర్ రెడ్డి తన ప్రగాఢ సంతాపం తెలిపారు.ఒక మంచి ప్రజా సేవకున్ని ప్రజలు కోల్పోయారని, విలువలు కలిగిన రాజకీయ నాయకుడు రాధాకృష్ణ అని అన్నారు. ఆయన మృతదేహంపై పూలమాలలు ఉంచి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. రావుల చంద్రశేఖరరెడ్డి వెంట జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల.అశోక్,మాజీ కౌన్సిలర్ నందిమల్ల.శారద, ముద్దుసర్,యాదయ్య, బాలయ్య ఉన్నారు.

## ఓటు హక్కును వినియోగించుకున్న చిన్నారెడ్డి

**టీ మీడియా, మే 13, వనపర్తి బ్యూరో :**



పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి తన సొంత గ్రామం జయన్న తిరుమలపురంలో ఓటు హక్కును వినియోగించుకోవడం జరిగింది. చిన్నారెడ్డి మాట్లాడుతూ చాలా గ్రామాలు తిరిగాను ప్రజల నుండి కాంగ్రెస్ పార్టీకి సానుకూలంగా స్పందన వస్తుంది. ప్రజలు రాహుల్ గాంధీని ప్రధాన మంత్రి కావాలి అని కోరుకుంటున్నారు. అందుకే ఎక్కడ చుసిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బ్రహ్మ రథం పడుతున్నారు.మన రాష్ట్రంలో కూడా రేవంత్ రెడ్డి ఆరు గ్యారంటీలు హామీ ఇచ్చి మిగిలిపోయిన గ్యారంటీ ఆగష్టు 15 వరకు పూర్తి చేస్తాము అన్నారు.రైతు బంధు కూడా 5 ఎకరాల వరకు రావడం జరిగింది. మిగిలినది ఎన్నికల తరువాత ఇవ్వడం జరుగుతుంది. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు డా. మల్లు రవి , చల్లా వంశీచంద్ రెడ్డి గెలవడం జరుగుతుంది అని చెప్పారు.చిన్నారెడ్డి తన సొంత గ్రామ ప్రజలతో కాసేపు మాట్లాడటం జరిగింది.

## ప్రజలే నా దేవుళ్ళు అని నమ్మిన వ్యక్తి రాధాకృష్ణ

- ఏఐపిసి స్టేట్ కోఆర్డినేటర్ డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి

**టీ మీడియా, మే12 , వనపర్తి బ్యూరో :**



వనపర్తి 31వ వార్డు కౌన్సిలర్ బండారు రాధాకృష్ణ మరణించిన విషయం స్థానిక నాయకుల ద్వారా ఏఐపిసి స్టేట్ కోఆర్డినేటర్ డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి తెలుసుకొని వారి ఇంటికి వెళ్ళి పూలమాల వేసి నివాళ్ళు అర్పించడం జరిగింది. వనపర్తి పట్టణంలో 31 వ వార్డు ప్రజలతో ఎంతో మంచి పేరు తెచ్చుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎప్పుడు నిరంతరం వార్డు ప్రజలతో వార్డు సమస్యల కోసం పోరాడి వార్డు ప్రజలే నా దేవుళ్ళు అని తుది శ్వాస వరకు ఆయన నమ్మిన వ్యక్తి ఆయనకు ఎన్ని కష్టాలు వచ్చినా ఎన్ని ఇబ్బందులు వచ్చిన కాంగ్రెస్ పార్టీని వీడలేదు. తుది శ్వాస వరకు కాంగ్రెస్ పార్టీలోనే పనిచేసి మరణించడం జరిగింది. అలాంటి నాయకుడు మరణించడం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు వారికి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వారి పవిత్రమైన ఆత్మకు శాంతి చేకూర్చాలని మనస్ఫూర్తిగా కోరారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారిని ఓదార్చడం జరిగింది. ఎప్పుడు ఏది అవసరం ఉన్న కాంగ్రెస్ పార్టీ మీకు అండగా ఉంటుంది అని వారికి భరోసా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో నందిమల్ల యాదయ్య, భాస్కర్, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కును వినియోగించుకున్న శాసనసభ్యులు

**టీ మీడియా, మే 13, వనపర్తి బ్యూరో : వనపర్తి**



వనపర్తి జిల్లా స్థానిక శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి సోమవారం వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గం పెద్దమందడి మండలం. మంగంపల్లి గ్రామం ప్రభుత్వ పాఠశాలలో పార్లమెంట్ ఎన్నికల ఓటు హక్కును. వారి సతీమణితో కలిసి పార్లమెంట్ ఎన్నికల ఓటు హక్కును వినియోగించుకున్నారు.

# తడిసిన ధాన్యంతో పోలింగ్ కేంద్రానికి

- పోలింగ్ బహిష్కరించిన రైతులు
- తాసిల్దార్ హామీతో ఓటు వేయడానికి ఒప్పుకోలు



**టి మీడియా, మే 13,భువనగిరి :**
యాదాద్రి భువనగిరి జిల్లాలోని పోచంపల్లి మండల వ్యాప్తంగా ఆదివారం రాత్రి కురిసిన అతి భారీ వర్షానికి మండల వ్యాప్తంగా సుమారు 6 లక్షలకు పైగా బస్తాలు ధాన్యం తడిచింది. కాగా సుమారు 70,000 ఐకెపి కేంద్రాలలో కొనుగోలు చేసిన బస్తాలో ధాన్యం సైతం తడిసింది. ధాన్యం కొనుగోలు చేసినప్పటికీ మిల్లుకు తరలించకపోవడంతో 70 వేల బస్తాలు త్రవ్వడం పట్ల రైతుల ఆగ్రహం వ్యక్తం చేస్తూ , ఆదివారం కనుముక్కల గ్రామంలో ధర్నా నిర్వహించారు. విషయం తెలిసిన పోచంపల్లి తాసిల్దార్ ఎస్పై వెంటనే అక్కడికి చేరుకొని, తడిసిన ధాన్యాన్ని కొంటాము అని తాసిల్దార్ హామీ ఇవ్వడంతో ధర్నాన్ని విరమింప చేసినట్లు తెలిపారు. కాగా ఇటీవలనే ఫిలాయిపల్లి గ్రామంలోని బాలాజీ రైస్ మిల్ యజమాని ధాన్యం అన్లోడ్ చేసుకోవాలంటే లారీ డ్రైవర్ పై చేయించుకొని, లారీ అద్దాలు పగలగొట్టడం పట్ల లారీ డ్రైవర్లు అందరూ ధర్నా నిర్వహించారు. గత మూడు రోజులుగా కొనుగోలు చేసినప్పటికీ మిల్లులకు తరలించలేదు. దీంతో ఆదివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి దాన్యం తడిచి ముద్దయింది. వెంటనే దాన్ని కొనుగోలు చేయాలని రైతులకు డిమాండ్ చేశారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్తో రైతులు ఓటింగ్ని బహిష్కరించగా, వెంటనే తాసిల్దార్ దాని కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో ఓటింగ్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాక వెంకటేష్ యాదవ్, పాక నరసింహ కోట అంజిరెడ్డి దారేపల్లి రాజిరెడ్డి, మట్టిపల్లి ఐలయ్య, చుక్క ఇస్తారి, నూకల లింగస్వామి, కొత్త లింగం, జంగారెడ్డి, అలగపెల్లి ఐలయ్య తోపాటు పలువురు పాల్గొన్నారు.

## ఖమ్మం, మహబూబాబద్ ఎంపీస్థానాలు గెలుస్తున్నాం

- రాజ్యసభ సభ్యులు వద్దిరాజు ధీమా



**టి మీడియా, మే 13,ఖమ్మం:**
18వ పార్లమెంటు ఎన్నికల్లో ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంటు స్థానాలకు జరిగిన ఎన్నికలలో ఖమ్మం ఎంపీగా నామ నాగేశ్వరరావు, మహబూబాబాద్ ఎంపీగా మాలోత్ కవిత బీఆర్ఎస్ ఎంపీలుగా విజయం సాధిస్తారని ఎంపీ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మం ఎన్ ఎస్ టి రోడ్ లోని డా.బీ అర్ అంబేద్కర్ కాలేజీ లోని పోలింగ్ బూత్ లో కుటుంబ సమేతంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఖమ్మం ఉమ్మడి జిల్లాతో పాటు మహబూబాబాద్ పార్లమెంటు స్థానానికి జరిగిన పోలింగ్ సరళిని పరిశీలిస్తే రెండు స్థానాల్లోనూ బీఆర్ఎస్ పార్టీ తప్పకుండా విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన అందించిన కేసీఆర్ ను ప్రజలు గుండెల్లో పెట్టుకొని ఎన్నికల్లో టిఆర్ఎస్ కు మద్దతు పలకనున్నారని ఆయన అన్నారు. దేశంలోనే మరే రాష్ట్రంలోనూ అమలు చేయని సంక్షేమ పథకాలను అందించిన బిఆర్ఎస్ ప్రభుత్వం తప్పకుండా మళ్లీ ప్రజా మద్దతుతో అధికారంలోకి వస్తుందని ఆయన జోస్యం చెప్పారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కునువినియోగించుకోవాలని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు.

## ఎంపీ అభ్యర్థి మాధవిలతపై కేసు నమోదుకు ఆదేశాలు

**టి మీడియా, మే 13,హైదరాబాద్:**



పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ తెలంగాణ వ్యాప్తంగా కొనసాగుతోంది. అయితే బీజేపీ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి మాధవిలత చేసిన ఓ పనికి ఆమెపై కేసు నమోదు చేయాలని ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్ ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్ కేంద్రంలో మహిళ బురఖా తొలగించి పరిశీలించిన మాధవిలతపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని రోనాల్డ్ రోస్ ఆదేశాలు జారీ చేశారు. అయితే పోలింగ్ సందర్భంగా హైదరాబాద్ పరిధిలో పలు పోలింగ్ స్టేషన్లకు వెళ్లి మాధవిలత ఓటరు కార్డులను పరిశీలించారు. పాతబస్తీలో పోలింగ్‌పై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

## ఓటు హక్కును వినియోగించుకున్న జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్

**టీ మీడియా, మే 13, వనపర్తి బ్యూరో :**



వనపర్తి జిల్లా కేంద్రంలో పార్లమెంట్ ఎన్నికల ఓటు హక్కును సోమవారం వనపర్తి జిల్లా ఎన్నికల అధికారి వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ పోలింగ్ స్టేషన్ 165./ 78 లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదనపు వనపర్తి జిల్లా లోకల్ బాడీ కలెక్టర్ సంజిత్ గంగ్వార్ కూడా ఓటు హక్కును మర్రికుంట లోనే వినియోగించుకున్నారు.

## తన ఓటును వినియోగించుకున్న ఎస్పీ

**టీ మీడియా, మే 13, వనపర్తి బ్యూరో :**





వనపర్తి పట్టణం మర్రికుంట లోని 165 వ పోలింగ్ కేంద్రంలో తన ఓటు ను వినియోగించుకున్న జిల్లా ఎస్పీ రక్షిత కె మూర్తి . ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఓటు హక్కు ఉన్న ప్రతిఒక్కరూ తప్పకుండా తమ ఓటు హక్కు ను వినియోగించుకోవాలన్నారు. ప్రజాస్వామ్యానికి ఓటుహక్కు వజ్రాయుధం అని తెలిపారు. పోలింగ్ కేంద్రానికి వచ్చే వారు నిబంధనలు పాటించి ప్రశాంత వాతావరణంలోఎన్నికలు జరుగడానికి సహకారించాలని కోరారు.

## కౌన్సిలర్ మృతదేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే మేఘా రెడ్డి

**టీ మీడియా, మే 13, వనపర్తి బ్యూరో :**



వనపర్తి జిల్లా కేంద్రంలో కౌన్సిలర్ రాధాకృష్ణ కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించిన వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి. వనపర్తి పట్టణం 31 వార్డు కౌన్సిలర్ రాధాకృష్ణ కుటుంబానికి తాను ఎల్లవేళలా అండగా ఉంటానని రాధాకృష్ణ మృతి తీరని లోటని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఉదయం ఆయన బాధిత కుటుంబాన్ని పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘా రెడ్డి రాధాకృష్ణ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ పార్టీలో చురుకైన పాత్ర పోషిస్తూ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ గా కొనసాగుతూ 31 వార్డు కౌన్సిలర్ గా కాంగ్రెస్ పార్టీలో గట్టి పట్టున్న నాయకుడిగా పేరొందిన బండారు రాధాకృష్ణ అనారోగ్యంతో మృతి చెందడం దురదృష్టకమన్నారు.రాధాకృష్ణ మృతి కుటుంబానికే కాక కాంగ్రెస్ పార్టీకి సైతం తీరని లోటు అని ఆయన సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చీర్ల చందర్ స్థానిక కౌన్సిలర్ వెంకటేశ్వర్లు, నియోజకవర్గ అసెంబ్లీ సమన్వయకర్త లక్కాకుల సతీష్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో ప్రిసైడింగ్ అధికారి మృతి

**టి మీడియా, మే 13,బీహార్ :**



బీహార్‌లో లోక్‌సభ ఎన్నికల నాలుగో దశ పోలింగ్ వేళ%ా% ముంగేర్‌లోని చకాసిం ఇబ్రహీం శంకర్‌పూర్ మిడిల్ స్కూల్‌లోని బూత్ నంబర్ 210లో విషాదం జరిగింది. డ్యూటీ చేస్తున్న ప్రిసైడింగ్ అధికారి ఓంకార్ చౌదరి గుండెపోటుతో మృతి చెందారు. అతని ఆరోగ్యం ఒక్కసారిగా క్షీణించింది. అతన్ని ఆసుపత్రికి తరలించేలోగానే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు.

## పోలింగ్ బూత్ కోసం ఆందోళన

**టి మీడియా, మే 13, మరిపెడ:**



తెలంగాణ వ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోంది. కొన్ని చోట్ల ఈవీఎంలో మొరాయిస్తున్నా..అధికారులు వెంటనే వాటిని సరిచేస్తున్నారు. తాజాగా రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం కొత్తూరు మండల పరిధిలోని కోడిచర్ల తండవాసులు ఓటు వేయకుండా నిరసనకు దిగారు. తమ తండాకు పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసిన ఎలాంటి స్పందన రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలింగ్ బూత్ నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్నందును వృద్ధులు,వికలాంగులు ఇబ్బంది పడుతున్నారని మండిపడ్డారు. బస్సు సౌకర్యం కూడా లేనందును తండాలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని రోడ్డుపై బైటాయించి నిరసన వ్యక్తం చేశారు . విషయం తెలుసుకున్న కొత్తూరు ఎమ్మార్వో తండా ప్రజలకు వచ్చే ఎన్నికల నాటికి పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. హామీ అనంతరం తాండ వసూలు నిరసనను విరమించారు.

## కౌన్సిలర్ మృతదేహనికి నివాళులు అర్పించిన చిన్నారెడ్డి

**టీ మీడియా, మే 13, వనపర్తి బ్యూరో :**



వనపర్తి 31వ వార్డు కౌన్సిలర్ బండారు రాధాకృష్ణ మరణించిన విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న చిన్నారెడ్డి వారి ఇంటికి వెళ్ళి పూలమాల వేసి నివాళ్ళు అర్పించడం జరిగింది.వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారిని ఓదార్చడం జరిగింది. ఎప్పుడు ఏది అవసరం ఉన్న నేను మీకు అండగా ఉంటాను అని వారికి భరోసా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కిరణ్ కుమార్, గద్దం వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల బూతులను పరిశీలించిన జలంధర్ రెడ్డి

**టీ,మీడియా, మే,13: ఆత్మకూరు**



మున్సిపాలిటీ కేంద్రంలో ఎన్నికల బూతులను పరిశీలించిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మాదిరెడ్డి జలంధర్ రెడ్డి ఎన్నికల నిమిత్తం 12 బూతులను ఏర్పాటు చేయగా ప్రతి బూతుకు వెళ్లి ఎన్నికలు సజావుగా సాగుతున్నాయా లేదో పరిశీలించి అనంతరం కార్యకర్తలతో ఎన్నికల మొత్తం ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకునేటట్టు చేసి ఎన్నికలు సజావుగా సాగేటట్టు చూడాలని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, మాజీ మండల అధ్యక్షులు, ఎండి రహమతుల్లా, టౌన్ అధ్యక్షులు నల్గొండ శీను, అజ్మతుల్లా, శారద శివకుమార్, ఎస్టిడి శీను, సాయి రాఘవ, రఘు గౌడ్, తదితరులు పాల్గొన్నారు

## పోలింగ్ విధులు నిర్వహిస్తున్న వ్యక్తి మృతి

**టి మీడియా, మే 13,అశ్వారావుపేట:**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేట నెహ్రూ నగర్ 165 బూత్ లో పోలింగ్ విధులు నిర్వహిస్తున్న చుచుంచుపల్లికి చెందిన శ్రీకృష్ణ(55) అనే వ్యక్తి గుండెపోటుతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. దీంతో అధికారులు హుటాహుటిన ప్రభుత్వ హాస్పిటల్ కి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు.



## తమ ఓటు తాము వేసుకోని నేతలు

**టీ,మీడియా, మే13, హైదరాబాద్:**
గ్రేటర్‌పరిధిలోని నాలుగు పార్లమెంట్ నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో కొందరు తమ ఓటును తమకు వేసుకోలేదు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాలో పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి మాధవీలత నివాసం ఈస్ట్ మారేడుపల్లిలోని మహేంద్రహిల్స్‌లో ఉంది. ఈ ప్రాంతం మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది. ఏఐఎంఐఎం అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ రాజేంద్రనగర్ పరిధిలోని శాస్త్రిపురంలో నివాసం ఉంటున్నారు. ఈ ప్రాంతం చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం కిందకు వస్తుంది. హైదరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి మహ్మద్ సమీర్ నివాసం జూబ్లీహిల్స్‌లో ఉంది. అది సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోకి వస్తోంది. దీంతో ఈ మూడు పార్టీల అభ్యర్థులు తమ ఓటును తాము వేసుకోలేకపోయారు. అదేవిధంగా చేవెళ్ల బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ కుత్బుల్లాపూర్‌లో నివాసం ఉంటున్నారు. అది మల్కాజిగిరి లోక్‌సభ స్థానం పరిధిలోకి వస్తుంది. మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డికి తాండూరులో ఓటుంది. ఆ ప్రాంతం చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది. వీరు కూడా తమ ఓటును తాము వేసుకోకుండా ఇతరులకు వేసిన పరిస్థితి.



## నరసరావుపేటలో తీవ్ర ఉద్రిక్తత

- రబ్బరు బుల్లెట్లు ప్రయోగం



**టీ,మీడియా, మే13, నరసరావుపేట :**
పల్నాడు జిల్లా నరసరావుపేటలో తీవ్ర ఉద్రిక్త నెలకొంది. నరసరావుపేట మున్సిపల్ హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో వైసీపీ, టీడీపీ కార్యకర్తలు గొడవపడ్డారు. పోలింగ్ కేంద్రంలోకి వెళ్లొద్దని టీడీపీ కార్యకర్తలను వైసీపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో రెండు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ ఘర్షణలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చదలవాడ అరవింద్ బాబుపై దాడి చేశారు. చదలవాడ అరవింద్ బాబు కార్లు ధ్వంసం చేశారు వైసీపీ కార్యకర్తలు. దీంతో ఒక్కసారిగా వైసీపీ ఎమ్మెల్యే గోపిరెడ్డి ఇంటిపై దాడి చేశారు టీడీపీ వర్గీయులు. పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు అలర్ట్ అయ్యారు. వెంటనే రబ్బర్ బుల్లెట్లు ప్రయోగించి ఇరువర్గాలను చెదరగొట్టారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. చదలవాడ అరవింద్ బాబు ప్రచారానికి వెళ్లగా.. వైసీపీ శ్రేణులు అడ్డుకున్నాయి. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఒకరిపై మరొకరు రాళ్ల దాడి చేసుకున్నారు. ఆ తర్వాత ఇరువర్గాల చెందిన వాహనాలను ధ్వంసం చేసుకున్నారు. టీడీపీ, వైసీపీ నేతల ఇళ్లపైనా రాళ్ల దాడి జరిగింది. దీంతో స్థానికంగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. వెంటనే అలర్ట్ అయిన పోలీసులు ఫైరింగ్ ఓపెన్ చేశారు. అల్లరి మూకలపై రబ్బర్ బుల్లెట్లు ప్రయోగించారు.

# నేను అత్యధిక మెజార్టీతో గెలవబోతున్నా..

- ఓటర్లు నా పక్షానే నిలిచారు
- అభివృద్దే నన్ను గెలిపిస్తుంది
- నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు
- బీఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు



**టీ,మీడియా, మే13,ఖమ్మం:**
బిఆర్ఎస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామ నాగేశ్వరావు నియోజకవర్గ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటర్లను కలిసి పోలింగ్ సరళిని పరిశీలించారు . ఈ సందర్భంగా ఓటర్లు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను వెంటనే ఫోన్ లో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారు .వైరా మండలం తాటిపూడి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి నప్పుడు గదిలో ఒక ట్యూబ్ లైట్ మాత్రమే ఉండడం వల్ల సరిగా కనిపించడం లేదని ఓటర్లు సమస్యను నామ దృష్టికి తీసుకురాగా నామ సత్వరమే స్పందించి కలెక్టర్ కి ఫోన్ చేసి సమస్యను వివరించి, పరిష్కరించారు.

ఖమ్మం కవిత పేజీ కాలేజీ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించు కున్న నామ నాగేశ్వరరావు తర్వాత పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ జరుగుతున్న తీరును ఎప్పటికప్పుడుపరిశీలించారు .ఈ సందర్భంగా ఆయన ఖమ్మం కవిత పిజి కాలేజ్ పోలింగ్ కేంద్రంతో పాటు శాంతి నగర్, ఎస్ ఆర్ బి జి ఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ పోలింగ్ కేంద్రంతో పాటు తనికెళ్ళ ,కొణిజర్ల, వైరా, సోమవరం ,రెబ్బవరం,తాటిపూడి ,తల్లాడ ,అన్నారుగూడెం ,బోనకల్ మండలం రావినూతల, ముష్టికుంట్ల, చింతకాని మండలం నాగులవంచ తదితర పోలింగ్ కేంద్రాలను నామ నాగేశ్వరరావు సందర్శించి పోలింగ్ జరుగుతున్న తీరుతెన్నులను పరిశీలించారు .పోలింగ్ శాతాన్ని అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు .

### నేనే గెలుస్తున్నా

ఈ సందర్భంగా నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ పోలింగ్ జరిగిన తీరును బట్టి ఓటర్లు బీఆర్ఎస్ పక్షానే నిలిచారని అన్నారు. తాను అత్యధిక మెజార్టీతో గెలవబోతున్నట్లు నామ స్పష్టంచేశారు. ప్రతి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి ఓటర్ల మనోభావాలు తెలుసుకున్నానని ,బీఆర్ఎస్ పార్టీ పక్షానే నిలిచి కెసిఆర్ కు అండగా ఉన్నట్లు తెలుస్తోందని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో తాను అత్యధిక మెజార్టీతో గెలవడం ఖాయమని ఆయన ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు .తాను చేసిన అభివృద్ధి కార్యక్రమాలు ,సంక్షేమ కార్యక్రమాలు ,పని చేసిన తీరు ,రైతు బిడ్డ గా తనను జిల్లా ఓటర్లు ఆదరించారని భావిస్తున్నానని చెప్పారు .
కెసిఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ,సంక్షేమ ఫలాలు అనుభవించిన ఖమ్మం జిల్లా ఓటర్లు తనకు ఓటు వేసి కేసీఆర్ కు అండగా నిలిచారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు .తాను రెండు సార్లు గెలిచి పార్లమెంట్ కు వెళ్లి ఎంపీగా ఎంతో అభివృద్ధి చేశానని, జిల్లా సమస్యలు, రాష్ట్ర ప్రయోజనాల పైన కేంద్రాన్ని ప్రశ్నించి అనేక సమస్యలను పరిష్కరించానని చెప్పారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు ,పెండింగ్ ప్రాజెక్టులు , రైల్వే ప్రాజెక్టులు, విభజన సమస్యల పైన గళమెత్తి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడానని చెప్పారు ఈ జిల్లా రైతు బిడ్డ నైన తాను నిత్యం జిల్లా ప్రజలతో ఉంటూ వారికి అండగా ఉండి వారితో మమేకమై ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకొని అండగా ఉన్నానని చెప్పారు. గత ఎన్నికల్లో మోసపూరిత హామీలతో ప్రజల వంచించిన కాంగ్రెస్ పార్లమెంటు ఎన్నికల్లో ఘోర పరాజయం చవి చూడటం ఖాయమని తేలిపోయిందనిన నామ స్పష్టం చేశారు .తనకు ఓటు వేసిన ఖమ్మం జిల్లా ఓటర్ల అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు నామ పేర్కొన్నారు .అలాగే తన విజయం కోసం మొదటి నుంచి చివరి వరకు రేయింబవళ్లు తనకు అండగా నిలిచి క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై పని చేసిన జిల్లా, మండల , గ్రామ, బూత్ స్థాయి నాయకులకు, కార్యకర్తలకు పేరుపేరునా కృతజ్ఞతలు, ధన్యవాదాలుతెలియజేస్తున్నానని నామ పేర్కొన్నారు.

### ఓటు హక్కు వినియోగించుకున్న నామ

ఖమ్మం నగరం లోని ఎన్ ఎస్ టీ రోడ్డు లో ఉన్న కవిత పీజీ కళాశాల లోని పోలింగ్ బూత్ లో బీ.ఆర్.యస్ పార్టీ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్ది నామ నాగేశ్వరరావు - చిన్నమ్మ దంపతులుతో పాటు వారి కుటుంబ సభ్యులు నామ సీతయ్య, నామ రామారావు, నామ కృష్ణయ్య, నామ పృధ్వి తేజ, నామ భవ్య తేజ దంపతులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## ప్రశాంతంగా ముగిసిన ఎంపి ఎన్నికలు

**టీ మీడియా, మే 13, రేవల్లి :**
మండల పరిధిలో అన్ని గ్రామాలలో ఉన్న పోలింగ్ బూత్ లలో సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికలు ఎలాంటి సమస్యలు లేకుండా ప్రశాంతంగా ముగిసినవి అని తెలిపారు. అన్ని గ్రామాల ప్రజలు కూడా ఎండ వేడికి తట్టుకుని సమన్వయం తో లైన్ లో నిల్చుని తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. వికలాంగులకు అధికారులు చక్రాల కుర్చీ సమకూర్చి వారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. వృద్ధులను, అనారోగ్యం తో ఉన్న వారికి ఇబ్బంది పడకుండా తగు సౌకర్యాలు కల్పించారు. మండల లో 18,490 ఓట్లకు గాను 11,700(63 %) ఓట్లు పోల్ అయినట్లు అధికారులు తెలిపారు.

## పెట్రోల్ పంపుపై హోర్డింగ్ పడి ముగ్గురు మృతి

- 37 మందికి గాయాలు



**టీ,మీడియా, మే13,ముంబై:**
మహారాష్ట్ర రాజధాని ముంబైని సోమవారం మధ్యాహ్నం పెను తుపాను తాకింది. బలమైన తుఫాను కారణంగా ముంబైలోని ఘట్కోపర్ ప్రాంతంలోని పెట్రోల్ పంపుపై పెద్ద హోర్డింగ్ పడిపోయింది. పెట్రోల్ పంపు వద్ద ప్రజలు తమ వాహనాల్లో పెట్రోల్, డీజిల్ ను నింపుకుంటున్నారు. ఈ సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ప్రజలకు ఏమి జరుగుతుందో అర్థం అయ్యేలోపే ఇనుప కోణంతో సహా మొత్తం హోర్డింగ్ పెట్రోల్ పంపుపై పడింది. ఈ ప్రమాదంలో దాదాపు 37 మంది తీవ్రంగా గాయపడ్డారు. హోర్డింగ్ కింద 100 మందికి పైగా చిక్కుకుపోయారు.సోమవారం మధ్యాహ్నం తీవ్ర తుఫాన్ సమయంలో గంటకు 40 నుంచి 50 కి.మీ వేగంతో గాలులు వీచాయి. ఈదురు గాలులు వీయడంతో పలు చోట్ల ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ఘాట్‌కోపర్‌లోని పెట్రోల్ బంక్ దగ్గర హోర్డింగ్ పడిపోవడం కూడా కెమెరాలో చిక్కింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

**శిథిలాల కింద నుంచి 54 మంది వెలికితీత**
ఘట్‌కోపర్‌లో హోర్డింగ్ కూలిన ఘటనలో శిథిలాల నుంచి ఇప్పటివరకు 54 మందిని రక్షించారు. గాయపడిన 51 మందిని రాజావాడి ఆసుపత్రిలో చేర్పించారు. గాయపడిన 3 మందిని హెచ్‌బీటీ ఆస్పత్రిలో చేర్పించారు. క్షతగాత్రులందరి పరిస్థితి నిలకడగా ఉంది. ఈ ప్రమాదంలో ఇప్పటి వరకు ఎవరూ మృతి చెందినట్లు సమాచారం లేదు.

## ఓటు వేయని వానికి ప్రశ్నించే హక్కు లేదు

- సతీష్ యాదవ్ మాజీ కౌన్సిలర్ అఖిలపక్ష ఐక్యవేదిక



**టీ మీడియా, మే 13, వనపర్తి బ్యూరో :**
భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు విలువ తెలుసుకొని ప్రతి ఒక్కరు ఓటు వేయాలని కోరుతున్నాను. ప్రశ్నించేవాడు తమ బాధ్యతగా ఓటు వేసి తమ హక్కులను కచ్చితంగా పొందాలని మనవి చేస్తున్నాను. ఓటు వేయని వానికి ప్రశ్నించే హక్కు లేదు అని సతీష్ యాదవ్ మాజీ కౌన్సిలర్ అఖిలపక్ష ఐక్యవేదిక వనపర్తి జిల్లా పేర్కొన్నారు.

## క్యూలో నిలబడి ఓటు వేసిన ప్రభుత్వ విప్



**టీ మీడియా, మే13ఎండపల్లి :**
పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఓటర్లకు తన ధ్వార ప్రజలకు ఇబ్బంది కలగ కూడదని సాధారణ వ్యక్తి లాగ క్యూలో నిలబడి సోమవారం తీగల గుట్ట పల్లెలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## నేటి యువతే స్ఫూర్తిదాయకం



**టీ,మీడియా, మే13, ఆత్మకూరు:**
మున్సిపాలిటీకేంద్రంలో నేడు జరిగిన ఎన్నికలపై మక్తల్ శాసనసభ సభ్యులు శ్రీ వాకిటి శ్రీహరి గారు టీమీడియాతో మాట్లాడుతూ,మొన్న జరిగిన శాసనసభ ఎన్నికల కంటే, పార్లమెంట్ ఎన్నికల్లో అధిక శాతం ఓట్లు నమోదు కావడం జరిగింది. సామాన్యంగా ఎమ్మెల్యే ఎన్నికల్లో చూపించిన ఉత్సాహం, ఎంపీ ఎన్నికల్లో చూపరు.కానీ నేటి యువత ఓటు హక్కు వినియోగించుకోవడం, తమ హక్కుగా భావిస్తున్నారని,పెరిగిన ఈ పోలింగ్ శాతం యువత ఆలోచించే తీరును వెల్లడిస్తుంది. జూన్ 3. తారీకు నా విడుదలయ్యే ఎన్నికల ఫలితాల్లో ఈ పార్లమెంట్ ఎన్నికల్లో తాము ఇచ్చిన హామీలే, తమను గెలిపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు, రాష్ట్ర కల్లుగీత కార్మిక శాఖ కేశం నాగరాజు గౌడ్, ఎండి రహమతుల్లా, రైచూర్ పరమేష్, నల్గొండ శీను, తులసి రాజ్ యాదవ్, మొగిలి గంగాధర్ గౌడ్, గంగాధర్,అజ్మతుల్లా, సాయి రాఘవ, రఘు గౌడ్, జహంగీర్, అమీర్ పాష, దామోదర్,ఆర్మీ శివ, తదితరులు పాల్గొన్నారు.

## 32 పోలింగ్ బూత్‌లలో ప్రథమ చికిత్స కేంద్రాల నిర్వహణ

- డాక్టర్ భవ్య శ్రీ



**టీ మీడియా, మే 13,ములుగు బ్యూరో:**
ములుగు జిల్లా వెంకటాపురం మండల పరిధిలో సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదిర సిబ్బంది తో 32 పోలింగ్ బూత్‌లలో 32 ప్రథమ చికిత్స కేంద్రాలను నిర్వహించారు . 2021 మంది ఔట్ పేషెంట్ లను పరిశీలించి , 816 మంది నిరుపేదలకు మందులను పంపిణీ చేసారు, ఈ కార్యక్రమంలో డాక్టర్ భవ్య శ్రీ , ఆశలు కొర్స రజిని, కొడిపే లక్ష్మి , గ్రామపంచాయతీ కార్యదర్శి పాయం రాజకుమారి ,అంగన్వాడీ సిబ్బంది ముర్రం దీప , పి హెచ్ ఎం లక్ష్మి ఏఎన్ఎంలు, ఎం ఎల్ హెచ్ పి ఎస్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## అంత్యక్రియలో కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు



**టీ మీడియా, మే 13, వనపర్తి బ్యూరో :**
వనపర్తి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ 31వ వార్డు కౌన్సిలర్ బండారు రాధాకృష్ణ అంత్యక్రియలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి పాల్గొని పూలమాల వేసి నివాళ్ళు అర్పించడం జరిగింది. నాగర్ కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి డా. మల్లు రవి , రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివ సేన రెడ్డి పాల్గొన్నారు.అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోసి కన్నీటి పర్యంతమైన ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ ఆత్మ గౌరవం కోసం బీఆర్ఎస్ పార్టీ నుంచి బయటికి వచ్చిన గత ఏడాది నుంచి తనతో పాటు తన అడుగులో అడుగు వేసి తనకు అండగా నిలిచిన 31వ వార్డు కౌన్సిలర్ బండారు రాధాకృష్ణ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని అన్నారు. ఇటీవల కొంత అనారోగ్యానికి గురైన రాధాకృష్ణ ఆదివారం మృతి చెందడం బాధకరమన్నారు. 31వ వార్డు నుంచి రెండు పర్యాయాలు కౌన్సిలర్‌గా గెలిచిన ఆయన ప్రజల మనిషిగా పిలిస్తే పలికే కౌన్సిలర్‌గా మంచి పేరు సంపాదించాడని , పేదరికంలో ఉన్నప్పటికీ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు చేయడంలో రాధాకృష్ణ ముందుండేవారని ఆయన మరణం 31వ వార్డు ప్రజలకు తీవ్ర నిరాశ మిగిల్చిందని , తనను తీవ్రంగా కలిచివేసిన సంఘటనగా ఆయన పేర్కొన్నారు. సోమవారం వనపర్తి పట్టణంలో నిర్వహించిన రాధాకృష్ణ అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రాధాకృష్ణ మృతదేహంపై పుష్పగుచ్చం ఉంచి ఘనంగా నివాళులర్పించి, పాడె మోసి కన్నీటి పర్యంతమయ్యారు. రాధాకృష్ణ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని ఆయన పేర్కొన్నారు. దివంగత కౌన్సిలర్ బండారు రాధాకృష్ణ మృదేహానికి పూలమాలతో నివాళులు అర్పించిన తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ శోక తప్త హృదయంతో బండారు రాధాకృష్ణ సౌమ్యుడు మంచివాడు ఓటమి ఎరుగని కౌన్సిలర్ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వారు చనిపోవడం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని అదేవిధంగా వ్యక్తిగతంగా నాతో చాలా మంచిగా ఉండేవాడు వ్యక్తిగతంగా మంచి సన్నిహితుల్ని కోల్పోయాను అని రాధాకృష్ణ భార్యను ఓదార్చి వారికి మనోధైర్యం కల్పించి వారికి వారి కుటుంబానికి నేను ఎప్పుడూ అండగా ఉంటాను. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు వారికి తోడుగా నీడగా ఉంటుంది అని వారు బాధతో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్, వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరే రాములు, చెన్నారములు, కోళ్ల వెంకటేష్, జానకి రాములు, గడ్డం వినోద్, రాము, కుమార్, రవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలను కలిసిన మాజీ మంత్రి కొప్పుల



**టీ మీడియా మే 13:ధర్మారం :**
మండలం లోని దొంగతుర్తి గ్రామంలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బిఆర్ఎస్ కార్యకర్తల ను కలిసి పోలింగ్ భూత్ లను పరిశీలించిన పెదపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ తన వెంట పుస్కూరి జితేందర్ రావు,ధర్మారం ఉప సర్పంచ్,నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన పోలింగ్..

- ఉత్సాహంతో ఓటింగ్ లో పాల్గొన్న ఓటర్లు..



**టీ మీడియా, మే13, మహానందిబి**
మహానంది మండలంలో సోమవారం జరిగిన పార్లమెంట్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం ఏడు గంటల నుండి సాయంత్రం ఆరు గంటల వరకు జరిగింది. ఈ పోలింగ్ లో మహిళా ఓటర్లు ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం ఏడు గంటలకు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. మండలంలో కొన్ని పోలింగ్ బూతుల వద్ద ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. మండలంలోని కొన్ని పోలింగ్ కేంద్రం వద్ద ఈవీఎంలు పనితీరు నిదానంగా ఉండడంతో ఓటు వేయడానికి చాలా సమయం పడుతుందని ఓటర్లు అన్నారు. గాజులపల్లె గ్రామంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్ల వద్ద ప్రజలు కిక్కిరిసి పోయారు.మహానంది మండలంలోని తిమ్మాపురం, అబ్బీపురం, బుక్కాపురం, తమ్మడపల్లె, సీతారామపురం, మసీదుపురం, గాజులపల్లి, గోపవరం, మహానంది గ్రామాలలో ఓటర్లు చాలా ఉత్సాహంగా ఓటింగ్ లో పాల్గొన్నారు.వృద్ధులు తమ ఓటు హక్కు వినియోగించుకోనుటకు ఆటోలలో తరలివచ్చారు .
ఉదయం ఏడు గంటల నుండి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ శాతం మండలం వ్యాప్తంగా పోలింగ్ 85.59 శాతం నమోదు జరిగిందని, మొత్తం 25470 ఓట్లు పోలయ్యాయి అని ఎన్నికల అధికారులు తెలిపారు.ఈసారి పోలింగ్ కేంద్రాల వద్ద వికలాంగులకు అసౌకర్యం కలగకుండా వీల్ చైర్లు ఏర్పాటు చేయడం విశేషం. ప్రతి కేంద్రం వద్ద భారీగా సిఆర్పిఎఫ్, పోలీస్ సిబ్బందితో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. నంద్యాల తాలూకా రూరల్ సిఐ శివకుమార్ రెడ్డి, మహానంది ఎస్సై నాగేంద్ర ప్రసాద్ ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద తిరుగుతూ భద్రత చర్యలు పర్యవేక్షించారు.మహానంది మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

## ప్రెస్ క్లబ్ బాయ్ కి సాయం



**టీ మీడియా, మే13,గోదావరిఖని, ప్రతినిధి:**
గోదావరిఖని ప్రెస్ క్లబ్ బాయ్ మహమ్మద్ దస్తగిరి కి రెండు మూత్రపిండాలు చెడిపోయి గత రెండు సంవత్సరాలుగా డయాలసిస్ చేయించుకుంటూ జీవిస్తున్న ఆయనకు నీడ భరోస స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు పల్లెర్ల రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం రూ521 కార్డు ప్రెస్ క్లబ్ కోశాధికారి గడ్డం శ్యామ్ ముఖ్యఅతిథిగా హాజరై అందజేశారు. ఈ సందర్భంగా గడ్డం శ్యామ్ మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా ప్రెస్ క్లబ్ బాయ్ గా దస్తగిరి సేవలందిస్తూన్న ఆయనకు గత రెండు సంవత్సరాలుగా రెండు కిడ్నీలు చెడిపోయి కిడ్నీ డయాలసిస్ మీద జీవిస్తున్నారని అన్నారు. పేద కుటుంబానికి చెందిన దస్తగిరికి నీడ గత రెండు సంవత్సరాలుగా నీడ ఆరోగ్యమస్తు పెన్షన్ 521 రూపాయలు అందిస్తున్నారని తెలిపారు. అలాగే ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుండి మార్చి వరకు పెన్షన్ రెన్యువల్ కార్యక్రమం గోదావరిఖని ప్రెస్ క్లబ్ ఆవరణలో చేయడం జరిగిందన్నారు. అనంతరం శ్యామ్ నీడ సేవలను కొనియాడారు. నీడ చేస్తున్న సేవలు ఎవరు కూడా చేయలేరని కొన్ని కార్యక్రమాలు ప్రభుత్వం కూడా ఆదర్శంగా తీసుకునేలా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు నీడతో కలిసి పని చేయాలని దస్తగిరి లాంటి వారికి ఎందరికో నీడ ఆసరాగా ఉండాలని పిలుపునిచ్చారు.

## మహారాష్ట్రలో ఎన్‌కౌంటర్.. ముగ్గురు మావోయిస్టులు మృతి



**టీ మీడియా, మే13,గడ్చిరోలి :**
మహారాష్ట్రలో సోమవారం ఎన్‌కౌంటర్ జరిగింది. గడ్చిరోలి జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మహిళలు సహా ముగ్గురు మావోయిస్టులు మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. బామ్రగఢ్ తాలుకాలోని కాట్రంగట్ట గ్రామానికి సమీపంలో పెరిమిలి దళం కమాండర్లు దాగున్నట్లు నిఘా వర్గాలకు సమాచారం అందిందని సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ నీలోత్పల్ తెలిపారు. సి-60 కమాండోస్‌కి చెందిన రెండు యూనిట్లు, గడ్చిరోలి పోలీస్ స్పెషల్ కంబాట్ వింగ్ కూంబింగ్ చేపట్టిందని అన్నారు. పోలీసులకు, మావోయిస్టులకు మధ్య ఎన్‌కౌంటర్ జరిగిందని, ముగ్గురు మావోయిస్టులు మరణించారని అన్నారు. ఈ ఎన్‌కౌంటర్‌లో పెరిమిలి దళం కమాండర్, ఇన్‌ఛార్జ్ వాసు మృతిచెందినట్లు అధికారులు తెలిపారు. ఘటనా స్థలం నుండి ఎకె.47 రైఫిల్, ఐఎన్ఎఎస్ రైఫిల్, కార్బైన్, మావోయిస్టుల రచనలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

## సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఎస్పీ



**టీ మీడియా, మే 13, వనపర్తి బ్యూరో :**
వనపర్తి జిల్లాలో గల కొత్తకోట నందు గల జడ్పీహెచ్ఎస్ స్కూల్ , మదనాపురం మండల కేంద్రంలో జడ్.పి.హెచ్.ఎస్ స్కూల్, పెద్దమందడి మండలంలోని మోజర్ల గ్రామంలోని స్కూలు నందు, గణపురం మండలంలోని సోలిపూర్ గ్రామంలో గల హైస్కూల్ వనపర్తి పట్టణము నందు గల బాలికల హై స్కూల్లో పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పటిష్టమైన బందోబస్తు గురించి తగు సూచనలు సలహాలు చేశారు. అలాగే ప్రజల ను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యంలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా అన్నారు.

## ఓటు హక్కు వినియోగించుకున్న మక్తల్ శాసనసభ్యులు



**టీ, మీడియా,మే, 13: మక్తల్**
నియోజకవర్గంలో బాలికల ఉన్నత పాఠశాలలో బూత్ నంబర్ 161 లో ఓటు హక్కు వినియోగించుకున్న మక్తల్ శాసనసభ్యులు శ్రీ వాకిటి శ్రీహరి గారు మరియు కుటుంబ సభ్యులు.

## ఏటీఎం నుంచి రూ.77 లక్షల నగదు కాజేసిన సిబ్బంది



**టి మీడియా, మే 13,పాల్వంచ:**
డబ్బు కోసం ఆ అధికారుల బుద్ధి గడ్డితినింది. ఏటీఎం మెషీన్లలో డబ్బులు పెట్టేందుకు వెళ్లి భారీగా నగదును దోచేశారు. దాదాపు రూ.77 లక్షల వరకు డబ్బు పక్కదారి పట్టించారు. అనుమానం వచ్చిన కంపెనీ ఇంటర్నల్ ఆడిటర్ ఆరా తీయగా అసలు బండారం బయటపడింది. ఈ షాకింగ్ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.వరంగల్ జిల్లా హనుమకొండలోని సీఎంఎస్ ఇన్ఫో సిస్టమ్స్ లిమిటెడ్ కంపెనీ బ్యాంకుల నుంచి నగదు తీసుకొని ఏటీఎం మెషీన్లలో అమర్చుతుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని రామవరం-2 ఎంక్లైన్‌కు చెందిన ములుగురి రాజశేఖర్, కొత్తగూడెం గాజులరాజంతోపాటు బస్తీకి చెందిన కందుకూరి సందీప్ అనే ముగ్గురు వ్యక్తులు ఆ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. వీరు ఆ ఏజెన్సీ నుంచి నగదు తీసుకుని కొత్తగూడెం, పాల్వంచ ప్రాంతాల్లోని పలు చోట్ల ఉన్న ఏటీఎం సెంటర్లలో డబ్బులు పెడుతుంటారు.ఈక్రమంలో వీరు తాజాగా కొత్తగూడెం, పాల్వంచ ఏటీఎంలలో నగదు పెట్టేందుకు వెళ్లారు. అయితే ఆయా ఏటీఎంలలో మొత్తం రూ.76,77,400 మేర లెక్కల్లో తేడా కనిపించింది. దీనిని ఆ కంపెనీ ఇంటర్నల్ ఆడిటర్ రాజు మే 8వ తేదీన గుర్తించారు. ఈ విషయమై రాజు విచారించగా.. రాజశేఖర్, సందీప్ అనే ఇద్దరు వ్యక్తులు కంపెనీని మోసం చేసి ఆ మొత్తాన్ని కాజేసినట్లు గ్రహించాడు. వెంటనే కంపెనీ మేనేజర్ జితేందర్‌కు విషయం తెలియజేయగా.. ఆయన పాల్వంచ పట్టణ పోలీసులకు శనివారం రాత్రి ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై బాణాల రాము మీడియాకు తెలిపారు.

## ఓటర్ల నిరసనలు ... పోలింగ్ కేంద్రాలు వెలవెల



**టి మీడియా, మే 13,హైదరాబాద్ :**
ఓటరు సత్తా తెలిసేది ఓటేసే రోజే ఈ సార్వత్రిక ఎన్నికలప్పుడే కదా! మా సమస్యలు పట్టించుకోండయ్యా.. అంటూ అన్నదాతలు, ప్రజలు ఎంత మొత్తుకున్నా కన్నెత్తి కూడా చూడని పాలకులు, నాయకులు ఇప్పుడు ఓట్ల కోసం మీతోనే మేము అంటూ ఓటర్లను బుజ్జగిస్తుంటారు. ముందుగా మా సమస్యల్ని పరిష్కరించండి-అప్పుడు ఓటేస్తాం అంటూ .. అన్నదాతలు, బాధిత ప్రజలు తెలంగాణలో నిరసన చేపట్టారు.

**తడిసిన ధాన్యంతో రైతుల ధర్నా..**
తెలంగాణలో లోక్ సభ ఎన్నికలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో %ా% తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం కనుముక్కల గ్రామ రైతులు ధర్నాకు దిగారు. ధాన్యం కొనుగోలు చేస్తేనే.. ఓటు వేస్తాం అని తడిసిన ధాన్యం బస్తాలతో పోలింగ్ కేంద్రం దగ్గర నిరసన తెలిపారు. దాంతో కనుముక్కల గ్రామంలో ఇంకా పోలింగ్ ప్రారంభం కాలేదు..

**బ్రిడ్జి నిర్మించండి : రాయమాదారం గ్రామ ప్రజలు**
ఖమ్మం జిల్లాలోని ఏన్కూర్ మండలం రాయమాదారం గ్రామ ప్రజలు లోక్‌సభ పోలింగ్‌ను బహిష్కరించారు. ఎన్ఎస్పీ కాలువపై బ్రిడ్జి నిర్మించాలంటూ నిరసన తెలుపుతున్నారు. ఈ నిరసనలో రాయమాదారం గ్రామ ప్రజలు అందరూ పాల్గన్నారు. దాంతో రాయమాదారంలో పోలింగ్ బూత్ వెలవెలబోయింది.

**గుట్ట మైనింగ్ ను రద్దు చేయండి : మైలారం గ్రామస్తులు**
నాగర్ కర్నూలు జిల్లాలోని బల్మూర్ మండలం మైలారం గ్రామస్తులు లోక్‌సభ ఎన్నికలను బహిష్కరించారు. దీంతో ఓటర్లు లేక 179వ పోలింగ్ కేంద్రం వెలవెలబోతోంది. గ్రామంలో ఉన్న గుట్ట మైనింగ్‌ను రద్దు చేయాలంటూ ప్రజలు ఎన్నికలను బహిష్కరించారు. విషయం తెలుసుకున్న ఆర్డీవో మాధవి.. మైలారం గ్రామానికి చేరుకుని ఓటర్లతో చర్చిస్తున్నారు. అయితే మైనింగ్ ఎన్ఓసీని రద్దు చేసే వరకు ఎన్నికలలో పాల్గనమని గ్రామస్థుల స్పష్టం చేశారు.